క్లుప్తంగా

ఎమ్మెల్యే సామేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ యువజన దళిత నాయకుడు పోలేపాక అంజయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. ఆయనతో పాటు చింతకుంట్ల విఠల్, చెడుపాక శ్రావణ్‌కుమార్, పోలేపాక సతీష్, మరికంటి అశోక్, బొంకూరి రంజిత్ తదితరులు ఉన్నారు.

మత్స్యకార్మిక సంఘం మాజీ డైరెక్టర్ రాములు మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడేనికి చెందిన మూసీ ప్రాజెక్ట్ మత్స్యకార్మిక సంఘం మాజీ డైరెక్టర్ ఈదుల రాములు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ పరామర్శించి నివాళులర్పించారు. అలాగే మూసీ ప్రాజెక్ట్ మత్స్య కార్మిక సంఘం మాజీ చైర్మన్ అలువాల వెంకటస్వామి, మామిడి సత్యనారాయణ తదితరులు రాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బైరబోయిన మహారాజు, పెద్ది శ్రీను, లొడంగి నాగరాజు, వెంకన్న, కోటమర్తి మల్లయ్య, కుంభం నాగరాజు, గీస భద్రయ్య, జానయ్య, సురేష్, నరేష్, సీతారాములు, భిక్షం తదితరులు ఉన్నారు.

జాజిరెడ్డిగూడెం ఆలయంలో విశేష పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకొని సంపూర్ణ భగవద్గీత పారాయణం, విష్ణుసహస్రనామార్చన, తులసి అర్చన, శ్రీపుష్పార్చన జరిపారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో తరలివచ్చి కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం అద్దాలు ధ్వంసం



పగిలిన ఆస్పత్రి భవనం కిటికీ అద్దాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో ఇటీవల డీఎంఎఫ్ నిధులు రూ.18 లక్షలతో పశు వైద్య ఉపకేంద్ర భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రారంభోత్సవం ఇంకా కాకముందే ఆకతాయిలు ఈ ఆస్పత్రి ఆవరణలో మద్యం సేవించి, తాగిన మైకంలో కిటికీల అద్దాలను ధ్వంసం చేశారు. ముఖ్యంగా ఈ ఆస్పత్రి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆకతాయిలు వచ్చి ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు, పశు వైద్యసిబ్బంది తెలిపారు. భవనానికి చుట్టూ ప్రహరీ నిర్మించాలని సంబంధిత అధికారులను పలువురు కోరుతున్నారు.

ఉద్యమాలతోనే పరిష్కారం

కోదాడఅర్బన్ : ఐక్య ఉద్యమాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఆ సంఘం జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశానికి తరలివెళ్లారు. అంతకుముందు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సులో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ కమిటీ సభ్యులు టీఏ జనార్దన్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు చందా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ప్రక్షాళన జరిగేనా..

- కొన్ని కేంద్రాల్లో ఎక్కువ.. మరికొన్ని కేంద్రాల్లో తక్కువ సంఖ్యలో ఓటర్లు
- ఎన్నికల్లో పోలింగ్ ఆలస్యమై రాత్రి వరకు జరుగుతున్న ప్రక్రియ
- బూత్‌లకు సమాన సంఖ్యలో ఓటర్లను కేటాయించాలని కోరుతున్న ఆయా గ్రామాల ప్రజలు



అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు రెండు వరుసల్లో బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

అర్వపల్లి : గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు పక్క పక్కనే ఉంటున్నప్పటికీ కొన్ని కేంద్రాల్లో ఎక్కువ మంది ఓటర్లు.. మరికొన్ని కేంద్రాల్లో తక్కువ మంది ఓటర్లను అధికారులు కేటాయించారు. దీంతో ప్రతిసారి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా మార్పులు చేర్పులు చేయకపోవడంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. కేంద్రాలకు ఓటర్లను సమాన సంఖ్యలో కేటాయిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. కానీ పక్క పక్క ఉన్న కేంద్రాల్లో ఒక దానికి 1,200 మంది ఓటర్లు.. మరో దానికి 500 మంది ఓటర్లు.. ఇలా అసమాన సంఖ్యలో కేటాయిస్తుండడంతో ఓట్లు వేసే సమయంలో ఓటర్లు గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జాజిరెడ్డిగూడెం మండలంలోని పలు కేంద్రాల్లో ఈ పరిస్థితే ఏర్పడింది. దీంతో రాత్రి పొద్దుపోయేవరకు ఓటింగ్ జరిగింది. ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటర్లు గంటల కొద్ది సమయం నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకున్నాయి.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 32 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం 23,166 మంది ఓటర్లు ఉన్నారు. అయితే అర్వపల్లిలో 120, 121 రెండు పోలింగ్ బూత్‌లుండగా 120వ బూత్‌లో 1,218 మంది ఓటర్లు ఉండగా, 121వ బూత్‌లో కేవలం 597మంది ఓటర్లు ఉన్నారు. ఈ రెండు కేంద్రాలు కూడా స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో పక్క పక్క తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 120వ బూత్‌లో అత్యధిక ఓటర్లు ఉండటంతో రెండు వరుసల్లో ఓటర్లు బారులుదీరి రాత్రి వరకు వేచి ఉన్నారు. దీంతో రాత్రి 7.30 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. అదే ఈ బూత్ పక్కనే ఉన్న 121వ పోలింగ్ బూత్‌లో కేవలం 597మంది ఓటర్లు మాత్రమే ఉండటంతో మధ్యాహ్నం వరకే ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. ఇలాగే తిమ్మాపురంలో 135వ బూత్ నందు కేవలం 472మంది ఓటర్లు ఉండగా, 137వ బూత్‌లో 1,196మంది ఓటర్లు ఉన్నారు. దీంతో ఇక్కడ ఓటింగ్ ప్రక్రియ రాత్రి 8 గంటల వరకు సాగింది. పర్సాయపల్లిలో కూడా ఇలానే 126వ బూత్ నందు 1,120 మంది ఓటర్లు ఉండగా, 127వ బూత్‌లో కేవలం 314మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ కూడా రాత్రి 7.30 గంటల వరకు ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఇలా అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలోనైనా అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఇబ్బంది మళ్లీ తలెత్తకుండా ఎక్కువ ఓటర్లు ఉన్న బూత్‌ల నుంచి ఓటర్లను తక్కువ ఓటర్లు ఉన్న బూత్‌లకు మార్చాలని మండల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలనందు కొన్నింటిలో ఎక్కువ మంది ఓటర్లు, మరికొన్ని కేంద్రాల్లో తక్కువ మంది ఓటర్లు ఉన్నారు. దీంతో పోలింగ్ సమయంలో ఇబ్బందులవుతున్న విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అర్వపల్లిలో మొన్న జరిగిన ఎన్నికల్లో ఇలాంటి ఇబ్బందే జరిగింది. ప్రత్యేక ఓటరు సవరణ సందర్భంగా ఈసారి ఓటర్లను మార్చాలి.

– దావుల వీరప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ

ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని అర్వపల్లి, తిమ్మాపురం, పర్సాయపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలనందు ఓటర్లను సమాన రీతిలో చేస్తూ జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మొన్నటి ఎన్నికల్లో తలెత్తిన సమస్య తమ దృష్టికి వచ్చింది. మళ్లీ ఈ సమస్య రాకుండా ఉండేందుకు వెంటనే తగు చర్యలు చేపట్టాం.

– జక్కర్తి శ్రీనివాసులు, తహసీల్దార్

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



అర్వపల్లిలో దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది



పెన్‌పహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో..

అర్వపల్లి : ప్రజాపాలన గ్రామసభల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులను వివిధ శాఖల సిబ్బంది ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆరు గ్యారంటీ పథకాలకు మండలంలో 10,449 దరఖాస్తులు రాగా రెండు రోజుల్లో సుమారు 3 వేల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆదివారం డీఏఓ, మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ కంఠమయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ మండలంలో..

పెన్‌పహాడ్ : మండలంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో రెండో రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా రెండో రోజు 2200 దరఖాస్తులను ఎంట్రీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఏపీఓ రవి, ఏపీఎం అజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మద్దిరాల మండల కేంద్రంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో వల్లపు రమేష్, బీమనబోయిన అవిలయ్య, ఎరుకల వెంకన్న, నాగెల్లి గోవింద్, బత్తిని శ్రీను, బాషబోయిన మహేష్, బత్తుల సాయి, మనోజు, బత్తుల అరవింద్ ఉన్నారు. వారికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిలి వెంకన్న, ఏలేటి నారాయణరెడ్డి, పచ్చిపాల వెంకన్న, రేసు విజయ్, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, కొమ్ము వెంకన్న, మద్దెల భిక్షపతి, మాన్‌సింగ్, హమీద్, ఉపేందర్, రేసు లింగయ్య, భూతం చలం, చామకూరి మలయ్య, నారాయణ, శ్యాం, మల్లయ్య, యాకయ్య, లింగయ్య, ఏల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



నాగారం : అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు



అర్వపల్లిలో..

నాగారం : అయోధ్యలో జనవరి 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న అయోధ్య రాముడి అక్షింతలు ఇటీవల నాగారం మండలం ఫణిగిరి రామాలయానికి చేరాయి. ఈ అక్షింతలకు ఫణిగిరి రామాలయంలో నిత్యం పూజలు నిర్వహించి ధర్మ జాగరణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాగారం గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు హరినాథచార్యులు, భక్తులు సంజీవ, వంగూరి అంజయ్య, లింగమల్లు, చిప్పలపల్లి మల్లేష్, సాయి, దశరథ, అనిల్, సోమయ్య, మల్లయ్య, గణేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఆదివారం అర్వపల్లిలో హనుమాన్ మాలధారులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు రాముడి పటాలు, కరపత్రాలను పంచారు. ఈ నెల 22న అయోధ్యలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా పండుగ వాతావరణంలో దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలధారులు జిన్న అశ్విన్, కనుకు భద్రి, భక్తులు పాల్గొన్నారు.

8నుంచి క్రీడా పోటీలు

నాగారం : సంక్రాంతి పండగను పురస్కరించుకొని నాగారం మండల పరిధిలోని ఈటూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు యల బాబు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో గెలు పొందిన వారికి క్రికెట్, వాలీబాల్ ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.10,116, కబడ్డీ ప్రథమ రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.8,116, తృతీయ బహుమతి రూ.5,116లతో పాటు షీల్డ్‌లు అందించనున్నట్లు తెలిపా రు. పూర్తి వివరాలకు సెల్ 9676266828, 97040 04300 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఆయనతో పాటు ఆ సంఘం నాయకులు వంగూరి సందీప్, బుడిద గణేష్, గట్టగళ్ల సుధాకర్, అనిల్, ఉదయ్‌కిరణ్, మహేష్ ఉన్నారు.

నిరుపయోగంగా జనరేటర్



పెన్‌పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

పెన్‌పహాడ్ : విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు పనులకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం పలు ప్రభుత్వ కార్యాలయాలకు జనరేటర్లను పంపిణీ చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జనరేటర్లు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటున్నాయి. పెన్‌పహాడ్ మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో అదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి గతంలో జనరేటర్‌ను సమకూర్చింది. కానీ దానిని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో కరెంట్ పోయినప్పుడు కార్యాలయంలో పనులు నిలిచిపోతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



కార్యాలయంలో విద్యుత్ పోయినప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కార్యాలయ ఆవరణలో గతంలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. కానీ దాని నిర్వహణకు సంబంధించి మాకు సమాచారం లేదు. జనరేటర్‌ను వినియోగించేందుకు తగిన ఏర్పాట్లు కూడా లేవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

అర్హులైన పేదలకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎల్గూరి గోవింద్

దురాజ్‌పల్లి : ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన పేదలకు కచ్చితంగా అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఏల్గూరి గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురంలో జరిగిన సీపీఎం వన్ టౌన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాల కోసం రాష్ట్ర ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల్లో దరఖాస్తు పెట్టుకున్న అర్హులైన పేదలకు పథకాలను అందించాలని కోరారు. రేషన్ కార్డు లేని వారికి తక్షణమే రేషన్ కార్డులు అందించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సీపీఎం పట్టణ నాయకులు వల్లపు దాసు సాయికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు మామిడి సుందరయ్య, షేక్ సైదులు, అర్వపల్లి లింగయ్య, షేక్ జహంగీర్, మామిడి పుల్లయ్య, శశిరేఖ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



సూర్యాపేట : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మహదేవ్

భానుపురి : నూతన సంవత్సరం సందర్భంగా గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందిన క్యాలెండర్‌ను సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్యాలెండర్‌లో పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్, సలహాదారు శౌధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, కోశాధికారి ఉప్పల శ్రవణ్, బందు శ్రీధర్ బాబు, గెల్లి అంజన్ ప్రసాద్, మిర్యాల వెంకటేశ్వర్లు, పీవీ లక్ష్మీనారాయణ, హేమమాలిని, సువర్ణ, రవి, కిరణ్, రమేష్, మల్లికార్జున నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నాగారంలో మండల కేంద్రంలో ఎల్ఐసీ నూతన సంవత్సర క్యాలెండర్లను కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలసీదారులకు ఎల్ఐసీ ఉత్తమ సేవలు అందిస్తుందన్నారు. పాలసీ పొంది ఉంటే వారి కుటుంబానికి రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, ఎల్ఐసీ ఫైనాన్స్ అడ్వయిజర్, సూర్యాపేట బ్రాంచ్ ఏజెంట్ కడారి సోమయ్య, నాయకులు యారాల ఇంద్రాసేనారెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, ఎల్మకంటి సోమన్న, బయ్యం వెంకన్న, మంగదుడ్ల దశరథ, ఎస్‌కే.వలీ, డప్పు సుధాకర్ పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘం సభ్యులకు ఎలాంటి ఆపద వచ్చినా సంఘం ఆధ్వర్యంలో ఆదుకోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల సోమేష్, తూడి మల్లయ్య, కోనేటి జానకిరాం, కేసాని అంజయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నాగారం : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



అర్వపల్లి : బొల్లంపల్లిలో..

మాలధారులకు అన్నదానం

కోదాడఅర్బన్ : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు దాతల సహకారంతో ఆదివారం అన్నదానం నిర్వహించినట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తిలు తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఆయన భార్య విజయలక్ష్మిలు ఆదివారం అన్నదాన కార్యక్రమానికి సహకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువా, జ్ఞాపికతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాఅన్వేష్, లక్ష్మీరాజేశ్వరి, మణిమహర్షి, వామచంద్రిక, గురుస్వామి రామనాథం పాల్గొన్నారు.

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి సీతరామరాజు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ మంద వెంకటేశ్వర్లు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గాలి శ్రీనివాస్ నాయుడు, బర్మావత్ సీతరాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, రంగారావు, నాగరాజు పాల్గొన్నారు.

నీల శ్రీనివాస్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



నీల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : బ్యాంకు ఉద్యోగిగా విశేషమైన సేవలతో ఇంటిపేరుకు బదులు బ్యాంకు శ్రీనుగా గుర్తింపు పొందిన నీల శ్రీనివాస్ ఆదర్శ జీవితాన్ని ప్రతి నాయకుడు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. సూర్యాపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నీల శ్రీనివాస్ దంపతులను సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ధర్మ భిక్షం భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడారు. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేశాడన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు చామల అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, అనంతుల మల్లేశ్వరి, కేవీఎల్, బొమ్మగాని శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చందుపట్లకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

మద్దిరాల : చందుపట్ల గ్రామానికి గతంలో నడిచిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ వంగూరి రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సూర్యాపేట నుంచి పోలుమల్ల, చందుపట్ల మీదుగా నర్సింహులపేటకు, అదే విధంగా మహబూబాబాద్ డిపోకు చెందిన మరో బస్సు ఈ గ్రామాల గుండా సూర్యాపేటకు వెళ్లేవని తెలిపారు. కానీ కొన్ని నెలలుగా ఆ బస్సులను పూర్తిగా నిలిపివేశారని, వెంటనే స్పందించి తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు విక్రమ్, వాసు, సోమిరెడ్డి, ఉపేందర్, సాయిలు, ఉప్పలయ్య, విజయ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లం సాగర్ మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు



నివాళులర్పిస్తున్న చెవిటి వెంకన్నయాదవ్

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్ మల్లం సాగర్ మృతి పార్టీకి తీరనిలోటని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుక్కడంలో సాగర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సాగర్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని కొనియాడారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం సాగర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్ల, నాయకులు పచ్చిపాల వెంకన్న, తాళ్లపెల్లి సురేషగౌడ్, మద్దెల భిక్షపతి, మద్దెల రాములు, మాన్‌సింగ్, ఉబ్బని రఘుపతి, మల్లం భిక్షం, మల్లం సతీష్, బానోతు శ్రీనివాస్, బింగి భిక్షపతి, రవి, గునగంటి రమేష్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు ఇచ్చి ఆదుకోవాలి

నూతనకల్ : కాంగ్రెస్ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలకు ప్రస్తుత ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ఇచ్చి ఆదుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఉప్పుల మురళి యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల కో ఆర్డినేటర్ ముత్యం ప్రసాద్, పంతం సాయి, గుండాల ప్రశాంత్, బొడ్డుపల్లి సందీప్, మడ్డి శ్రావణ్, మణికుమార్, గోపి, మహేష్, సాయి, వేణు, ప్రవీణ్ పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీలో పలువురి చేరిక

నూతనకల్ : చిల్పకుంట్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ మాట్లాడారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాడటంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో న్యూడెమోక్రసీ ముందుంటుందని తెలిపారు. 10 కుటుంబాలు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దగ్గుల మల్లయ్య, దేసోజు మధు, పెద్దింటి అశోక్‌రెడ్డి, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, బిక్కి ప్రవీణ్, మందడి భూపాల్‌రెడ్డి, పెద్దింటి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



తిరుమలగిరిలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1991–92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య, కృష్ణమూర్తి, కొండల్‌రెడ్డి, రెహమాన్‌అలీ, జోసెఫ్, జైపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, కృష్ణమాచారి, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం అభినందనీయం

నడిగూడెం : పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి అన్నారు. ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో తెలుగు బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో గ్రామానికి చెందిన కాంపాటి కోటయ్యను వలంటీర్‌గా నియమించిన డాక్టర్ శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో వేముల వెంకటేశ్వర్లు, వెంపటి మనోహర్, వల్లభనేని వెంకట వరప్రసాద్, తాళ్లూరి రమేష్, దార వెంకటరత్నం, జంపాల సత్యనారాయణ, నరేష్, సురేష్ పాల్గొన్నారు.